క్లుప్తంగా

నష్టపోయిన రైతుల జాబితా సిద్ధం చేయండి

చిప్పగిరి: రబీ సీజన్‌లో పంటలు సాగుచేసి నష్టపోయిన రైతుల జాబితా పక్కాగా రూపొందించాలని ఏడీఏ సునీత మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాలో చిప్పగిరి ఉందని చెప్పారు. మండలంలో రబీ సీజన్‌లో పంటలు సాగుచేసి నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏఓ విజయలక్ష్మి, ఏఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంగమాంబ రథోత్సవం


కరిడిగుడ్డంలో కొలువైన మంగమాంబ

ఆలూరు రూరల్: మండలంలోని కరిడిగుడ్డం గ్రామంలో కొలువైన అవధూత మాంగమాంబ, కమ్మరచేడు గ్రామంలోని మంగమ్మవ్వ రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం రథోత్సవం నిర్వహిస్తారు. రథోత్సవానికి తరలివచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. కరిడిగుడ్డం, కమ్మరచేడు గ్రామాల్లో రథోత్సవాలకు ఎస్‌ఐ ఓబులేసు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కార్యదర్శికి పదోన్నతి

మద్దికెర: జిల్లా పంచాయతీ అధికారులు తనకు గ్రేడ్–1 కార్యదర్శిగా పదోన్నతి కల్పించినట్లు మద్దికెర పంచాయతీకి ఇన్‌చార్జ్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సంజప్ప సోమవారం తెలిపారు. పదోన్నతి కల్పించి అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారన్నారు.

ఆటో బోల్తా - ముగ్గురికి తీవ్రగాయాలు

తుగ్గలి: మండల పరిధిలోని రాతన సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గుంతకల్లు మండలం ములకలపెంటకు చెందిన నలుగురు రైతులు పత్తికొండ వారపు సంతలో పొట్టేళ్లు కొనుగోలు చేసి తిరిగి వెళ్తుండగా మార్గంమధ్యలో రాతన ఆశ్రమ పాఠశాల వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రంగనాయకులు, ఆంజనేయులు, హనుమప్ప తీవ్రంగా గాయపడగా చిన్న పెద్దన్నకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన ముగ్గురిని వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు తుగ్గలి పోలీసులు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

మద్దికెర: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నేరచరిత్ర కలిగిఉన్న వారిని పిలిపించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అంతేగాక మండలంలోని గ్రామాలలో ఎవరైనా అల్లర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని వెల్దుర్తి మండల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్/తహసీల్దార్ అనంతాచారి, మోడ్ ఆఫ్ కోడ్ కండక్ట్ అధికారి/ఎంపీడీఓ శివశంకరప్ప హెచ్చరించారు. సోమవారం వారు మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని రామళ్లకోట, పలు గ్రామాలను తనిఖీ చేస్తూ పలు చోట్ల ప్రభుత్వ పథకాల పోస్టర్లు, ఫొటోలు తొలగింపజేశారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయించారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి గ్రామాలలో కోడ్ పక్కాగా అమలు చేయాలని ఆయా పంచాయతీల అధికారులను ఆదేశించారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి


సిద్ధం కిట్లను అందజేస్తున్న చంద్రశేఖర్

ఆస్పరి: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం సైనికుల్లా పనిచేయాలని యువనాయకుడు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఆస్పరి, జొహరాపురం, హలిగేర గ్రామాలలో 'మేము సిద్ధం– మా పోలింగ్ బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. బూత్ కన్వీనర్లకు సిద్ధం కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించి ఓట్లను అభ్యర్థించాలన్నారు. జెడ్పీటీసీ దొరబాబు, నాయకులు మూలింటి రాఘవేంద్ర, గోవర్ధన, బసవరాజు, వెంకటేష్, మహానంది తదితరులు పాల్గొన్నారు.


నాడు - గుంతలమయంగా ఉన్న హెబ్బటం - పెద్దగోనెహాళ్ రోడ్డు


నేడు - రాకపోకలకు అనువుగా మారిన రహదారి


నాడు - రాళ్లు రప్పలు తేలి అధ్వానంగా ఉన్న వందవాగిలి రోడ్డు


నేడు - అద్దంలా మెరుస్తున్న తారు రోడ్డు

నాడు అధ్వానం.. నేడు సౌకర్యవంతం


నాడు - పెద్దహ్యాట రోడ్డులోని వంక


నేడు - సౌకర్యవంతంగా రూపుదిద్దుకున్న తారు రోడ్డు

హొళగుంద: వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధికి ఈ చిత్రాలు ఓ చిన్న నిదర్శనం. జగనన్న పాలనలో మారుమూల గ్రామాలకు సైతం తారు రోడ్లు ఏర్పడి రాకపోకలకు సౌకర్యంగా మారాయి. వీటితో పాటు ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందుబాటులోకి వచ్చాయి. నిత్యం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేస్తూ ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడుతో పాటు టీడీపీ, జనసేన నేతలు గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, ప్రజలకందించిన సంక్షేమ పథకాల గురించి కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. గత టీడీపీ పాలనలో హొళగుంద మండలంలో ఏ రోడ్డు బాగు పడింది లేదు. అయితే వైఎస్సార్‌సీపీ పాలనలో చాలాకాలంగా మరమ్మతులకు నోచుకోని పల్లె రోడ్లు కూడా తారు రోడ్లతో కొత్త రూపు సంతరించుకున్నాయి. ఈ రోడ్లను గత టీడీపీ ప్రభుత్వం ఎందుకు నిర్మించలేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎలా పూర్తి చేసిందనే ప్రశ్నకు ఆ పార్టీ నాయకుల వద్ద సమాధానం ఉండదు. ఇవే కాదు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి విషయంలోనూ అదేతీరు. నేడు పల్లె రోడ్లు బాగు పడడంతో నిత్యం ప్రయాణంలో నరకం చూసే ప్రజల కష్టాలు తీరాయి. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు నేడు ధైర్యంగా ప్రజలను ఓటు అడుగుతున్నారు.

టీడీపీ పాలనలో చేసిందేమీ లేదు

ఆంధ్రా–కర్ణాటక సరిహద్దులో ఉన్న హొళగుంద మండలంలోని గ్రామీణ రోడ్ల గురించి దశాబ్దాల కాలంగా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం తర్వాత నాలుగేళ్ల కాంగ్రెస్ పాలనలో ఎల్లార్తి–ఆలూరు రోడ్డు మినహాయించి, ఆ తరువాత ఐదేళ్ల టీడీపీ పాలనలో ఒక్క రోడ్డు కూడా బాగు పడలేదు. రాళ్లు రప్పలు తేలి, గుంతలమయంగా మారి నరకానికి నకల్లుగా మారిన ఈ రోడ్లను అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాగు చేసింది. ఇందులో ప్రధానమైన ఆంధ్ర–కర్ణాటక రాష్ట్రాలను కలిపే 5 కి.మీ మార్లమడికి రోడ్డును రెండు లైన్ల రహదారిగా మార్చేందుకు చురగ్గా పనులు సాగుతున్నాయి. స్థానిక వాల్మీకి సర్కిల్ నుంచి ఎల్లెల్సీ బ్రిడ్జ్ దాటి కొద్ది దూరం వరకు (400 మీటర్లు) డబుల్ సీసీ రోడ్డు అక్కడి నుంచి మార్లమడికి వరకు దాదాపు 4 కి.మీ డబుల్ తారు రోడ్డు వేయనున్నారు.

పూర్తయిన రోడ్లు, నిధుల మంజూరు వివరాలు

- పెద్దహ్యాట రోడ్డు 1.35 కి.మీలకు రూ.77.40 లక్షలతో పూర్తి
- హొళగుంద–మార్లమడికి రోడ్డు 5.10 కి.మీలకు రూ.5.40 కోట్లతో నిర్మించారు
- హెబ్బటం–ఇంగళదహాళ్ రోడ్డు 3 కి.మీలకు రూ.1.85 కోట్లు
- వందవాగిలి రోడ్డులో గాదిలింగప్ప గుడి నుంచి గ్రామంలోకి 1 కి.మీలకు రూ.55.87 లక్షలు
- సమ్మతగేరి రోడ్డు 1.9 కి.మీలకు రూ.1.20 కోట్లు
- 5 కి.మీ కోగిలతోట రోడ్డుకు రూ.1.85 కోట్లు
- ముగుమానుగుంది రోడ్డు 1 కి.మీలకు రూ.62.36 లక్షలు మంజూరు చేశారు. ఈ పనులన్నీ పూర్తికావడంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు సౌకర్యాంగా మారాయి.

గ్రామాల్లో పోలీసు కవాతు


చింతకుంటలో కవాతు చేస్తున్న బలగాలు

ఆలూరు: జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు సోమవారం ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలోని గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. రానున్న జనరల్ ఎలక్షన్స్‌లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజల్లో ధైర్యం నింపేలా మల్లికార్జునపల్లి, చింతకుంట, హోలహర్వి, నిట్రవట్టి గ్రామాల్లో రూట్ మార్చ్ నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసు శాఖ కృషి చేస్తోందన్నారు. కవాతులో ఎస్‌ఐ నరేంద్ర, కేంద్ర మిలటరీ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడి అరెస్ట్

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంటుపల్లె గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో రైతు రవితేజకు చెందిన చీని, కొబ్బరి మొక్కలు, డ్రిప్‌ను అదే గ్రామానికి చెందిన దాయాది లక్ష్మినారాయణ నిప్పుపెట్టి కాల్చివేసిన సంఘటన ఈనెల 4వ తేదీన చోటుచేసుకుంది. ఈ విషయంపై రవితేజ తమను ఆశ్రయించగా విచారణ జరిపి సోమవారం నిందితుడు లక్ష్మినారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తాను ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించాలని కోరడంతో జీర్ణించుకోలేని నిందితుడు ఈ ఘటనకు పాల్పడ్డాడని, అప్పు వసూలయ్యేలా, పండ్ల మొక్కలు,డ్రిప్ కాల్చివేతపై తగిన చర్యలు తీసుకోవాలంటూ రవితేజ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆలూరు రూరల్: మండలంలోని మొగలవల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఓబులేసు సోమవారం తెలిపారు. నిందితుల నుంచి రూ.8,190 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి


ప్రచారంలో భాగంగా టైలర్ షాపులో మిషన్ కుడుతున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: గత ఐదేళ్లుగా అవినీతికి తావు లేకుండా ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందించిన సంక్షేమ రథసారథి సీఎం వైఎస్ జగనన్నకు మరోసారి మద్దతు ఇచ్చి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలంటూ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక ప్రజలను కోరారు. సోమవారం పట్టణంలోని 24వ వార్డులో వార్డు కౌన్సిలర్ రామాంజినమ్మ, ఇన్‌చార్జ్ రుద్రాక్షాల బజారితో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. చేనేతల ఇళ్లకు వెళ్లి నేతన్న నేస్తం అములుతో ఎలా లాభపడ్డారో ఆరా తీస్తూ మగ్గం నేసి వారిలో ఉత్సాహం నింపారు. మహిళా టైలర్లను కలిసి మిషన్ కుడుతూ ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం అడిగి తెలుసుకున్నారు. వ్యాపారులను ఓటర్లను కలిసి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఇచ్చే హామీలను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాల ఊసే ఉండదని హెచ్చరించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వార్డు పరిధిలో మిగిలిన సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, బుట్టా రంగయ్య, మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, యుకె రాజశేఖర్, సునీల్‌కుమార్, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు అండగా నిలిచిన ప్రభుత్వం

ఎమ్మిగనూరుటౌన్: నేత వృత్తిని వదులుకొని చితికిపోయిన చేనేత కార్మికులకు సీఎం వైఎస్ జగన్ నేతన్న నేస్తం పథకం ప్రవేశపెట్టి అండగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నాయకుడు బుట్టా ప్రతుల్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 1, 2, 6వ వార్డుల పరిధిలో ఆయా వార్డు కౌన్సిలర్లు ఎంకె శివప్రసాద్, నాగేషప్ప, అంపమ్మలతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. చేనేతల ఇళ్లకు వెళ్లి రాట్నం వడికి, మగ్గం నేసి వారి యోగక్షేమాలను తెలుసుకుంటూ మరోసారి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని, పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకం కింద ఏటా రూ.24 వేలు అందించి నేత పనికి పూర్వ వైభవం కల్పించిన ఘనత సీఎం జగనన్నదే అన్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, కౌన్సిలర్లు అమాన్, రాజారత్నం, చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


6వ వార్డులో రాట్నం వడుకుతూ చేనేతలను ఓట్లు అభ్యర్థిస్తున్న బుట్టా ప్రతుల్

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత


పట్టుబడ్డ కర్ణాటక మద్యంతో నందవరం పోలీసులు

నందవరం: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని నందవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. సి.బెళగల్ మండలం తిమ్మందొడ్డి గ్రామానికి చెందిన బోయ వీరేష్, లక్ష్మన్న మోటారు సైకిళ్లపై సోమవారం మద్యాన్ని తీసుకొస్తూ నాగలదిన్నె బ్రిడ్జి వద్ద ఎమ్మిగనూరు రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, నందవరం ఎస్‌ఐ తిమ్మయ్య చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డారు. వీరు కర్ణాటకలోని తలమారి గ్రామానికి చెందిన వీరేష్ నుంచి మద్యం కొనుగోలు చేసి తీసుకొస్తున్నట్లు తెలిసింది. నిందితుల నుంచి 1920 (90 ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రెండు బైకులను సీజ్ చేశారు. అలాగే సాయంత్రం తుంగభద్ర నదీ తీరంలో దాడులు చేస్తుండగా కర్ణాటకలోని చిన్నమంచాల గ్రామానికి చెందిన లింగప్ప అనే వ్యక్తి నుంచి 1152 (90 ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో దాడులు ముమ్మరం చేయడంతో కర్ణాటక మద్యం భారీగా పట్టుబడినట్లు సీఐ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

తుగ్గలి: మండల పరిధిలోని రామలింగాయపల్లిలో అక్రమంగా విక్రయించేందుకు తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సోమవారం పట్టుకున్నట్లు జొన్నగిరి ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. గ్రామానికి రాగిరి చిన్నరాముడు ఇంటి వద్ద కర్ణాటకకు చెందిన 130 ఒరిజనల్ ఛాయిస్ టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

పిల్లల ఎదుగుదలపై దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత

నందవరం: పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్త్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు సూచించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లకు పిల్లల పెరుగుదలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు మాతాశిశు సంరక్షణ లక్ష్యంగా పనిచేయాలన్నారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 5 సంవత్సరాల పిల్లల పెరుగుదలపై అవగాహన కల్పించామన్నారు. మెదడు అభివృద్ధి దశ నుంచి ఆరోగ్యం, పరిశుభ్రత, పౌష్టికాహారంపై పిల్లల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలకు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. శిశువులకు ఇచ్చే టీకాలను తప్పనిసరిగా వేయాలని పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధావతి, ఎంఎల్‌హెచ్‌పీ తోఫిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు


మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న విరూపాక్షి

ఆలూరు రూరల్: రాష్ట్రంలో నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి పిలుపునిచ్చారు. ఆయన సోమవారం మండలంలోని కరిడిగుడ్డం, ముద్దగనగేరి, కురుకుంద, హులేబీడు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదే అన్నారు. టీడీపీ పాలనలో 'దాచుకో.. దోచుకో.. పంచుకో' తప్పా రాష్ట్ర ప్రజలకు చేసిందేమి లేదని విమర్శించారు. 14 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన చంద్రబాబు ఇప్పుడు ఎన్నికల పొత్తుల జిమ్మిక్కులతో మీ ముందుకు వస్తున్నాడని.. ఆయన మాటలు నమ్మితే నట్టేట ముగినట్టేనని తెలిపారు. గతంలో పచ్చచొక్కాల వారికే సంక్షేమ పథకాలు దక్కేవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ప్రతిఒక్కరికీ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కురుకుంద ఎంపీటీసీ సభ్యుడు ఏసప్ప టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. మండల జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్, మండల కన్వీనర్ ఈరన్న, సర్పంచులు దేవిరెడ్డి, సుధాకర్ రెడ్డి నాయకులు వెంకటేష్, భీమయ్య శివమణి, వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

ఆలూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షికి క్రమంగా నాయకులు, కార్యకర్తల మద్దతు పెరుగుతోంది. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి విరూపాక్షి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. సోమవారం మండలంలోని కురుకుంద గ్రామానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ ఏసన్న వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే హోలహర్వి మండలం నిట్రవట్టకి చెందిన 20 కుటుంబాలు ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ తిమ్మప్ప ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. హులేబీడుకు చెందిన 50 కుంటుంబాలు విరూపాక్షి సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో కురువ వెంకటేష్, గోవిందు, మల్లయ్య, ఆటో వెంకటేష్, ఉచ్చారెడ్డి, గాదిలింగప్ప, భీమేష్ మల్లేష్, రాఘవేంద్ర, వీరేష్, మహేష్ ఉన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం ఉంటుందని, కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని విరూపాక్షి వారికి హామీ ఇచ్చారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.


విరూపాక్షి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నెరణికి గ్రామ టీడీపీ నాయకులు

ఆలూరు రూరల్: హొళగుంద మండలం నెరణికి గ్రామానికి చెందిన 100 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం సాయంత్రం ఆలూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి, మండల కన్వీనర్ షఫీవుల్లా, కో–కన్వీనర్ రవి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

మద్దికెర: ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ రమేష్‌బాబు ససూచించారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో ప్రజలకు ఎన్నికలపై విధివిధానాలపై అవగాహన కల్పించారు. గ్రామస్తులు ప్రజలు లా అండ్ ఆర్డర్ గురించి అవగాహన ఉండాలన్నారు. సర్పంచ్ విజయుడు, సిబ్బంది చంద్రశేఖర్, కోదండరాముడు తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు సోమవారం మండలంలోని కరివేముల గ్రామంలో ప్రజలతో సమావేశమై మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

పకడ్బందీగా పరీక్షల నిర్వహణ

కృష్ణగిరి: జిల్లావ్యాప్తంగా ఓపెన్‌స్కూల్ ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు డీఈఓ కె.శామ్యూల్‌పాల్ పేర్కొన్నారు. ఆయన సోమవారం కృష్ణగిరి జిల్లా పరిషత్ పాఠశాల కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కర్నూలు డివిజన్‌లో 10 సెంటర్లు, ఆదోని డివిజన్‌లో 11 సెంటర్లలో మొత్తం 3,742 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్, 21 సిట్టింగ్ స్క్వాడ్ టీంలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కృష్ణగిరి కేంద్రంలో 173 మందికిగాను 162 మంది పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సెంటర్ల ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. అలాగే పదో తరగతికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 162 కేంద్రాల్లో 37,081 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఈ పరీక్షలకు ఏడుగురు ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు, 51 సిట్టింగ్ స్క్వాడ్ టీంలను ఏర్పాటు చేసి పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.


కృష్ణగిరి జెడ్పీ హైస్కూల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ కె.శామ్యూల్

7 నామినేషన్ల దాఖలు

పత్తికొండ రూరల్: పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికకు 7 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి ఆవుల మైరాముడు సోమవారం తెలిపారు. అధ్యక్ష స్థానానికి 3 నామినేషన్లు రాగా మిగిలిన పోస్టులకు ఒక్కొక్క నామినేషన్ వచ్చినట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఎన్నికల సహాయ అధికారులు వై.మధుబాబు, బి.ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కృష్ణగిరి: మంచంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడిన వ్యక్తి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని చిట్యాల గ్రామానికి చెందిన కొసనపల్లె ఎల్లప్ప (56) ఈ నెల 15న సాయంత్రం ఇంటి వద్ద మంచంపై పడుకుని ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. అక్కడున్న రాయికి మెడ భాగం బలంగా తగలడంతో వెన్నుపూస విరిగి నడవలేని స్థితిలో ఉన్న ఈయన్ను కుటుంబసభ్యులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆయన కోలుకోలేక సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తె సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలియజేశారు.

ధ్రువపత్రాల జారీ నిలిపివేత

ఆలూరు: సచివాలయం, మీసేవా కేంద్రాల ద్వారా అన్ని ధ్రువపత్రాల జారీని తాత్కాలికంగా నిలిపివేసినట్లు తహసీల్దార్ బ్యూల తెలిపారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సచివాలయం, మీ సేవా కేంద్రాల్లో ప్రభుత్వానికి సంబంధించి పోస్టర్లు, ప్రభుత్వ లోగోలు ఉన్న స్టేషనర్లు, సర్టిఫికెట్లను జారీ చేయరాదని ఆదేశాలు ఉన్నాయని వెల్లడించారు.